నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఘట్‌కేసర్: మరమ్మతుల కారణంగా పట్టణంలోని ఘట్‌కేసర్ సబ్‌స్టేషన 11కేవీ యంనంపేట్ ఫీడర్ పరిధిలో యంనంపేట్, ఇస్మాయిల్‌ఖాన్‌గూడలో ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు, 11కేవీ ఎన్ఎఫ్‌సీనగర్ ఫీడర్ పరిధిలోని ఎన్ఎఫ్‌సీనగర్‌లో మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఘట్‌కేసర్ ఏఈ యశ్వంత కుమార్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ



కీసర: సేవా కార్యక్రమంలో భాగంగా నాగారం మాజీ వార్డు సభ్యులు గౌరక్క సత్యంసాగర్ పుట్టినరోజు సందర్భంగా నాగారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని సుమారు 350 మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగులను అందచేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మాదిరెడ్డి వెంకట్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డబీల్‌పూర్‌లో ఉచిత వైద్య శిబిరం



శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

మేడ్చల్: ఎల్లంపేట్ మున్సిపాలిటీ పరిధిలోని డబీల్‌పూర్‌లో గురువారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వార్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి వైద్యులు హాజరై శిబిరానికి వచ్చిన వారికి పరీక్షలు నిర్వహించి మందులు అంజేశారు. సీజనల్ వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వైద్యులు డాక్టర్ లావణ్య, డాక్టర్ క్రిష్టియాన, కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, సిబ్బంది సత్యనారాయణ, గీత, వీణకుమారి, పద్మ, కృష్ణవేణి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

అల్వాల్‌లో పర్యటించిన కార్పొరేటర్ శాంతి

అల్వాల్: అల్వాల్‌లో మురుగునీటి వ్యవస్థ మూసుకుపోవడంపై కాలనీవాసుల ఫిర్యాదు మేరకు కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి గురువారం జలమండలి అధికారులతో కలిసి పరిశీలించారు. మురుగునీటి వ్యవస్థ మూసుకుపోయిన ప్రాంతాన్ని వెంటనే తొలగించి చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులకు తెలిపారు. కార్యక్రమంలో జలమండలి మేనేజర్ చారి, శేఖర్, అరుణ్, యాదగిరి, సాజిద్, లింగారెడ్డి, శిరీష తదితరులు పాల్గొన్నారు.

హెల్ప్‌ఏజ్‌కు విద్యార్థుల ఆర్థిక సాయం



రామంతాపూర్: గోకుల్‌నగర్‌లోని బాలభారతి స్కూల్‌లో విద్యార్థులు సేకరించిన రూ.13,400లను స్కూల్ సెక్రటరీ సత్తిరాజు కపిలేశ్వర్ హెల్ప్‌ఏజ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి శుభాంకరకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమ పాకెట్ మనీని పొదుపు చేసి స్వచ్ఛంద సంస్థకు అందజేయడం ప్రశంసనీయం అన్నారు. ప్రతి విద్యాసంస్థలో విద్యార్థి దశ నుంచే వారిలో పొదుపు గుణాన్ని అలవర్చాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగలక్ష్మీ, పద్మజ, సుశీల, నాగమణి, సరస్వతి, సరిత, శ్యామల, బేబీ తదితరులు పాల్గొన్నారు.

భవనంపై నుంచి కిందపడి వ్యక్తి మృతి

మేడిపల్లి: నిర్మాణంలో ఉన్న భవనం పైనుంచి కిందపడి వ్యక్తి మృతి చెందిన ఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్రకు చెందిన దయానంద్(32), బ్రహ్మం స్నేహితులు. ఐదురోజుల నుంచి బోడుప్పల్ వీరారెడ్డి కాలనీలో నిర్మాణంలో ఉన్న భవనంలో కార్పెంటర్‌గా పనిచేస్తూ అదే భవనంలో ఉంటున్నారు. బుధవారం రాత్రి బ్రహ్మం కింద నిద్రపోతుండగా బిల్డింగ్‌పై దయానంద్ ఫోన్ మాట్లాడుతూ.. ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందాడు. గురువారం ఉదయం బ్రహ్మం దయానంద్ కోసం వెతుకుతుండగా బిల్డింగ్ వెనుక కిందపడి మృతి చెంది ఉండటాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని మృత దేహాన్ని గాంధీ మార్చురీకి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

నత్తనడకన కొనసాగుతున్న రాంపల్లి చౌరస్తా - ఘట్‌కేసర్ యనంపేట రహదారి విస్తరణ పనులు





నత్తనే నయం!

సాగుతున్న రహదారి విస్తరణ పనులు | ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
తరచూ ప్రమాదాలు జరుగుతున్నా నిర్లక్ష్యం | ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రయాణికులు



కంకర కుప్పలు ఇలా..

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధి రాంపల్లి చౌరస్తా నుంచి యనంపేట వరకు, రాంపల్లి–చర్లపల్లి వరకు చేపడుతున్న ప్రధాన రహదారుల విస్తరణ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. దీంతో ఈ రహదారుల మీదుగా నిత్యం రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు, రాంపల్లి, నాగారం తదితర ప్రాంతాలవాసులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఆరు నెలల కాలంలో రహదారి విస్తరణలో భాగంగా కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా ప్రమాదాలు చోటుచేసుకొని నలుగురు మృత్యువాత పడ్డారు. పలువురికి గాయాలయ్యాయి. ఈ నెల 7న రోడ్డు విస్తరణలో భాగంగా రాంపల్లి సత్యనారాయణ కాలనీ సమీపంలో ప్రధాన రహదారిలో కాంట్రాక్టర్ పోసిన కంకర రాళ్ల వల్ల ఓ ద్విచక్రవాహనదారుడు అదుపు తప్పి రోడ్డుపై పడిపోగా వెనుక నుంచి వచ్చిన లారీ చక్రాలు అతడి తలపై నుంచి వెళ్లడంతో అక్కడే మృతి చెందగా మరో వ్యక్తికి గాయాలయ్యాయి. ఇన్ని ప్రమాదాలు చోటు చేసుకుంటున్నా కాంట్రాక్టర్ మాత్రం రహదారి విస్తరణ పనుల్లో వేగం పెంచడం, కంకర రాళ్లు రహదారిపై రాకుండా చర్యలు చేపట్టడం లేదు. రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్న చోట సూచిక బోర్డులు ఏర్పాటు చేయడం లేదు. రోడ్డు కాంట్రాక్టర్ నిర్లక్ష్య వైఖరిపై ఇప్పటికే నాగారం, రాంపల్లి ప్రాంతాలకు చెందిన స్థానికులు, యువజన సంఘాల నేతలు, పలు పార్టీల నేతలు పెద్ద ఎత్తున ధర్నాలు కూడా చేపట్టినా అధికారులు మాత్రం స్పందించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

రూ.254 కోట్ల నిధులతో..

రాత్రి వేళల్లో అయితే వాహనదారులు మరింత ఇబ్బందులు పడాల్సి వస్తోంది. చర్లపల్లిలో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన కొత్త రైల్వే టెర్మినల్ ప్రారంభమైన నేపథ్యంలో రాంపల్లి–ఘట్‌కేసర్ ప్రధాన రహదారి, రాంపల్లి–చర్లపల్లి, రాంపల్లి–కరీంగూడ రహదారుల మీదుగా వాహనాల రాకపోకలు పెరిగాయి. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి చర్లపల్లి రైల్వేస్టేషన్‌కు సాఫీగా ప్రయాణికులు చేరుకోవడానికి రాష్ట్రం ప్రభుత్వం ఇక్కడి రహదారులను విస్తరించాలని నిర్ణయించి హెచ్‌ఆర్‌డీసీఎల్ ద్వారా రూ.254 కోట్లు నిధులతో నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని 6 రహదారుల విస్తరణ పనులు చేపట్టిన విషయం తెలిసిందే. రాంపల్లి చౌరస్తా నుంచి ఘట్‌కేసర్, యనంపేట వరకు రాంపల్లి– చర్లపల్లి బీఎస్ఎన్ఎల్ వరకు, రాంపల్లి– కరీంగూడ ఓఆర్ఆర్, రాంపల్లి-సాయిగూడెం ఓఆర్ఆర్, దమ్మాయిగూడ రోస్‌గార్డెన్ నుంచి నాగారం వరకు, నాగారం డబుల్‌బెడ్‌రూం నుంచి యనంపేట్ వరకు రోడ్డు విస్తరణ పనులను చేపడుతోంది.

త్వరగా రోడ్డు విస్తరణ పనులు పూర్తిచేయాలి



రాంపల్లి చౌరస్తా–ఘట్‌కేసర్ ప్రధాన రహదారి, రాంపల్లి–చర్లపల్లి ప్రధాన రహదారి విస్తరణ పనులను త్వరగా పూర్తిచేయాలి. నిత్యం వేలాది వాహనాల రాకపోకలు సాగిస్తున్న ఈ రహదారిలో రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్న కాంట్రాక్టర్ పలు జాగ్రత్తలు తీసుకోవాలి. రోడ్డు విస్తరణ పనులను ఇష్టానుసారంగా కాకుండా, నిత్యం రాకపోకలు సాగిస్తున్న వాహనదారులకు ఇబ్బందులు ఎదురవ్వకుండా పనులు పూర్తిచేయాలి. ఈ మేరకు ప్రభుత్వం, అధికారులు చర్యలు చేపట్టాలి.

– కౌకుట్ల చంద్రారెడ్డి,
నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్.

దాదాపు 8 నెలలు కావొస్తున్నా..

ఈ రహదారుల విస్తరణ పనుల్లో భాగంగా ప్రస్తుతం రాంపల్లి చౌరస్తా నుంచి ఘట్‌కేసర్–యనంపేట వరకు, రాంపల్లి–చర్లపల్లి వరకు రహదారుల విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. పనులు ప్రారంభించి దాదాపు 8 నెలలు కావొస్తున్నా రోడ్డు పనులు మాత్రం ఇంకా జోరందుకోలేదు. రాంపల్లి చౌరస్తా నుంచి యంనంపేట బ్రిడ్జి వరకు పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. ఇప్పటికీ ఈ రహదారిలో పనులు కొద్ది మేర తవ్వకాలు, మరికొద్దిమేర కంకర వేయడం, మరికొద్ది దూరంలో బీటీ రోడ్డు పూర్తిచేయడం ఇలా కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా చేపట్టడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. చర్లపల్లి నుంచి రాంపల్లి పాత చెరువు వాగు వరకు మాత్రమే రోడ్డు విస్తరణ పనులు పూర్తయ్యాయి. వాగు నుంచి రాంపల్లి వరకు పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఘనంగా గురుపౌర్ణమి

మేడ్చల్: గురుపౌర్ణమిని అన్ని ప్రాంతాల్లో వైభవంగా గురువారం జరుపుకున్నారు. వివిధ ఆలయాలతో పాటు సాయిబాబా ఆలయం, అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేడ్చల్ ప్రముఖులు, రాజకీయ పార్టీల నేతలు ప్రత్యేక దర్శనాలు చేసుకున్నారు. మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, డీసీసీ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి తదితర ప్రముఖ నేతలు సాయినాథుడి సేవలో పాల్గొన్నారు.



మేడ్చల్ సాయిబాబా సన్నిధిలో ఎంపీ ఈటల రాజేందర్



నాగారం సత్యనారాయణకాలనీలో సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు



ఘట్‌కేసర్‌లో అధ్యాపకుడు సూర్యప్రకాశ్‌ను సత్కరిస్తున్న మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి



సాయిబాబాకు హారతి ఇస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న గుండ్లపోచంపల్లి మున్సిపల్ అధ్యక్షుడు కావేరి శ్రీధర్ ముదిరాజ్



గురువులను సత్కరిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు



మేడ్చల్ బాలుర పాఠశాలలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సామాజిక వేత్తలు

పోచారంలో హెచ్‌పీసీఎల్ పరిశుభ్రత డ్రైవ్



స్వచ్ఛత కార్యక్రమంలో హెచ్‌పీసీఎల్ సంస్థ ఉద్యోగులు

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని పోచారంలో హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) ఆధ్వర్యంలో గురువారం పరిశుభ్రత డ్రైవ్ నిర్వహించారు. సంస్థ ఆధ్వర్యంలో జూలై 1 నుంచి 15వ తేదీ వరకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా పోచారంలోని శివాలయం పరిసర ప్రాంతాలను పరిశుభ్రం చేశారు. వ్యర్థాల విభజన, వృక్షాల పెంపకం, పర్యావరణ పరిశుభ్రత, ఒకసారి ఉపయోగించే ప్లాస్టిక్ వాడకాన్ని అరికట్టడం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెచ్‌పీసీఎల్ చర్లపల్లి డీజీఎం అనుజ్ శ్యాంబెహరిలాల్ మాట్లాడుతూ.. స్వచ్ఛతా పఖ్వాడా అనేది కేవలం ప్రభుత్వ కార్యక్రమం కాదని, ఇది సామూహిక బాధ్యత అన్నారు. మన నగరాన్ని నివసించడానికి మెరుగైన ప్రదేశంగా మార్చడానికి కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు. స్వచ్ఛత కార్యక్రమంలో హెచ్‌పీసీఎల్ నుండి ఆరుగురు అధికారులు, 50 మంది సిబ్బంది, 30 మంది గ్రామస్తులు, 10 మంది మున్సిపల్ కార్మికులు ఉత్సాహంగా డ్రైవ్‌లో పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం

మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్



జవహర్‌నగర్‌లో భూమిపూజ చేస్తున్న శ్రీకాంత్ యాదవ్, మాజీ డిప్యూటీ మేయర్ శ్రీనివాస్

జవహర్‌నగర్: ప్రజాసంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని కాంగ్రెస్ పార్టీ జవహర్‌నగర్ కార్పొరేషన్ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్ అన్నారు. జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని పలు వార్డుల్లో మాజీ డిప్యూటీ మేయర్ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ శంకర్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ నిహారికగౌడ్, ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులతో కలిసి ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌యాదవ్ మాట్లాడుతూ.. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మాట్ల వినయ్‌కుమార్, హౌసింగ్ ఏఈ, వార్డు ఆఫీసర్లు, నాయకులు లత, భాగ్య, వెంకటేష్, రాజుయాదవ్, బుజ్జి, శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్త వేరు చేయడంపై అవగాహన



ఆర్‌జీకే కాలనీలో అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ సిబ్బంది

కీసర: 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని ఆర్‌జీకే కాలనీలో కమిషనర్ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్త, వ్యర్థాలను వేరు చేయడంపై అవగాహన కల్పించారు. అదేవిధంగా చీర్యాలలో ఇందిరమ్మ కాలనీ, ఎస్‌జేఆర్ కాలనీలో మొక్కలు పంపిణీ చేశారు. తిమ్మాయిపల్లిలో రోడ్డుకు ఇరువైపులా చెత్తను, పొదలను తొలగించారు. కీసరలో భూగర్భ డ్రైనేజీలు శుభ్రం చేయించారు. మున్సిపల్ మేనేజర్ వెంకటేశం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రభు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నూతన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలి

మల్లాపూర్: మల్లాపూర్ డివిజన్ పరిధిలోని ఓల్డ్ మల్లాపూర్ పఠాన్‌బస్తీ, అన్నపూర్ణ కాలనీలో నూతనంగా విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని కోరుతూ గురువారం మల్లాపూర్ విద్యుత్ ఏఈ నాగరాజుకు గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నేత నెమలి అనిల్‌కుమార్ వినతి పత్రాన్ని అందజేశారు. శిథిలావస్థకు చేరిన స్తంభాలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, బస్తీబాట కార్యక్రమంలో తమకు విన్నవించారని అన్నారు. ఏఈ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. మల్లాపూర్ డివిజన్ సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్, సురేష్‌గౌడ్ ఉన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలను గుర్తించాలి

మల్కాజిగిరి: ప్రజల ఆరోగ్యంలో కీలకంగా వ్యవహరించే పారిశుద్ధ్య కార్మికుల సేవలను ప్రజలు గుర్తించాలని మల్కాజిగిరి, ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ల కార్పొరేటర్లు శ్రవణ్, ప్రేమ్‌కుమార్ అన్నారు. డివిజన్ల పరిధిలో పనిచేసే కార్మికులకు వ్యక్తిగత ఆరోగ్య భద్రత కిట్స్‌ను గురువారం అందజేశారు. కార్పొరేటర్లు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో వారి సేవలు వెలకట్టలేమన్నారు. ప్రజలు సహకరించి చెత్తా చెదారాన్ని చెత్తఆటో కార్మికులకు అందజేయాలని, బహిరంగ ప్రదేశాల్లో వేయవద్దన్నారు. కార్యక్రమంలో ఏఎమ్‌హెచ్‌ఓ డాక్టర్ మంజుల, శానిటరీ సూపర్‌వైజర్ చింత శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంచుకోవాలి

అల్వాల్: అల్వాల్ త్రివేణి పాఠశాలలో జరిగిన ఇన్‌వెస్టిట్యూర్ వేడుకల్లో కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి హాజరై ఎన్నికైన విద్యార్థి నాయకులకు బ్యాడ్జీలు అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలన్నారు. రోజువారీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ తోటి విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీఎస్‌వో సుబ్బారావు, సీఆర్‌వో వెంకట్రావు, ప్రిన్సిపల్ సుధా, జాట్ టీమ్ హెడ్ అర్చనతాకూర్, నాయకులు అరుణ్, లింగారెడ్డి, యాదగిరి, సాజిద్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పిల్లలకు విలువలతో కూడిన జీవితం అందించాలి




తల్లిదండ్రులకు పాద పూజ చేస్తున్న పిల్లలు



మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

మేడ్చల్: పిల్లలకు తల్లితండ్రులు, ఉపాధ్యాయులు విలువలతో కూడిన జీవితం అందించేలా పనిచేయాలని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని నారెడ్డి నందారెడ్డి సునందారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు తల్లిదండ్రులకు నిర్వహించిన పాదపూజోత్సవం కార్యక్రమంలో గురువారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల దత్తత యజమాని నందారెడ్డి విద్యార్థులకు విలువలు నేర్పడానికి ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. విద్యార్థులకు జీవితంలో విలువలు నేర్పడానికి తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు మరింత కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. పేద పిల్లలకు పేదరికం శాపం కాకుడదని, వారిని ఉన్నత శిఖరాలకు చేర్చేవిధంగా పని చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించిన వారికి ఎంపీ సన్మానం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సుదర్శన్‌రెడ్డి, నందారెడ్డి, మాజీ సర్పంచ్‌లు సునందారెడ్డి, జగన్‌గౌడ్ మాజీ జెడ్పీటీసీ శైలజ, ఉపాధ్యాయులు, తల్లితండ్రులు తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులను సన్మానించిన ముదిరాజ్ సంఘం నేతలు



మేడ్చల్: ఎల్లంపేట్ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరంగవరంకు చెందిన పలువురు వివిధ శాఖలలో పని చేసి ఉద్యోగ విరమణ చేయడంతో వారిని గ్రామానికి చెందిన ముదిరాజ్ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. గ్రామానికి చెందిన శ్రీనివాస్(సీఆర్‌పీఎఫ్), కృష్ణ(ఏఎఫ్‌ఏ), రమేష్(ఈవీఎల్)లలో పని చేసి ఉద్యోగ విరమణ చేయడంతో వారిని శ్రీరంగవరంలో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పోచయ్య ముదిరాజ్, సంఘం నాయకులు నర్సింహ, భూపాల్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ముంపు సమస్యకు పరిష్కారం



గౌతంనగర్: డివిజన్ పరిధిలోని రాజశ్రీనివాస్‌నగర్‌లో రూ.1.3 కోట్లతో చేపట్టనున్న బాక్స్‌డ్రైన్ పనులను గురువారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్ మేకల సునీతరాముయాదవ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దశాబ్ద కాలంగా మిర్జాలగూడ, వెంకటాద్రినగర్, రాజానగర్, రాజశ్రీనివాసనగర్ ప్రాంతాల్లో వర్షాకాలంలో తరచూ ముంపు సమస్య నివారణకు బాక్స్‌డ్రైన్ పనులు చేపట్టామన్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించి సకాలంలో పూర్తి చేసి అందుబాటులో తేవాలన్నారు. కార్యక్రమంలో సర్కిల్ అధికారులు లౌక్య, దివ్యజ్యోతి, మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్ నాయకులు బద్దం పరుశురాంరెడ్డి, జేఏసీ వెంకన్న, మురుగేష్, చిన్నయాదవ్, మేకల రాముయాదవ్, హేమంత్ పాటిల్, కాలనీవాసులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.